నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
13 | హైదరాబాద్, ఆదివారం 4 ఫిబ్రవరి 2024 | SANGAREDDY



సాసర్‌ఫీట్‌లో నీళ్లు పడుతున్న బీట్ అధికారి రాముతో ఉపాధి కూలీలు

# మల్లన్న.. మమ్మేలు

- నేడు 'మల్లన్న' మూడో ఆదివారం
- ముగిసిన పట్నం, లష్కర్‌వారాలు



సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి

చేర్యాల, ఫిబ్రవరి 3: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాల్లో నేడు మూడో ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. పట్నం, లష్కర్ ఆదివారాల సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకోవడంతో పాటు మొక్కులు చెల్లించుకోనున్నారు. పట్నం వారానికి సుమారు 50వేల మంది భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. స్వామి వారి క్షేత్రానికి వచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నం వేసి బోనం సమర్పించుకోనున్నారు. మహామండపం, గంగరేగుచెట్టు ఆవరణతో పాటు తాము బస చేసిన గదుల వద్ద పట్నాలు వేయనున్నారు. మరికొందరు భక్తులు మల్లన్నగుట్ట పైన ఎల్లమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. మల్లన్న క్షేత్రంలో మొక్కుల అనంతరం కొండపోచమ్మ, నల్లపోచమ్మ ఆలయాలకు తరలివెళ్లనున్నారు. స్వామివారి క్షేత్రానికి తరలివచ్చే భక్తుల కోసం ఆలయ ఈవో ఎ.బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## అడవి జంతువుల సంరక్షణకు చర్యలు

రామాయంపేట, ఫిబ్రవరి 3: వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఎండల తీవ్రత పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో అడవి జంతువుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. మెదక్ జిల్లా రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అక్కన్నపేట, తొనిగండ్ల గ్రామ బీట్ పరిధిలోని అడవి జంతువుల దాహం తీర్చేందుకు 16సాసర్ ఫీట్లలో నీటిని ఫారెస్ట్ అధికారులు అందుబాటులో ఉంచుతున్నారు. జంతువులతో పాటు అడవిలో మొక్కలకు వాటర్ ట్యాంకర్‌తో నీళ్లను పడుతున్నామని ఫారెస్ట్ బీట్ అధికారి రాము తెలిపారు. రెండు రోజులకోసారి నీళ్లు నింపుతున్నామని ఆయన తెలిపారు. అడవిలో నాటిన మొక్కలకు ఉపాధి హామీ కూలీల ద్వారా రోజూ నీళ్లు అందిస్తున్నామన్నారు. అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అడవిలో పొడవాటి చెట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జంతువుల ఆనవాళ్లను గుర్తిస్తున్నామన్నారు. 16 సాసర్ ఫీట్ల దగ్గర ఎక్కడ ఎలాంటి జంతువుల కదలికలు వచ్చినా వెంటనే రామాయంపేట అటవీశాఖ కార్యాలయంలో సైరన్ మోగుతుందని బీట్ అధికారి రాము తెలిపారు. సైరన్‌తో అటవీ సిబ్బంది అప్రమత్తమవుతామని తెలిపారు. అడవిలోకి వెళ్లే రైతులు తమ పశువులను మొక్కలు మేయకుండా చూడాలన్నారు. తమ అనుమతి లేనిది అడవిలోకి వెళ్లవద్దన్నారు. అడవిలోకి అగ్గిపెట్టెలు, టార్చిలైట్లు తీసుకెళ్లరాదని ఆయన సూచించారు.

## హామీలన్నీ అమలు చేయాలి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్, ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు రూ.2500 అందజేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా పాలన ప్రజలకు దగ్గరకావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఆసరా రూ.4 వేలు, రైతు భరోసా రూ.15 వేలను వెంటనే ఇవ్వాలన్నారు. పింఛన్ డబ్బులు ఇవ్వకపోవడంతో చాలా మంది వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పింఛన్ డబ్బులు అందజేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొమ్మిదిన్నరేండ్లు సీఎంగా ఉన్న కేసీఆర్‌ను రేవంత్‌రెడ్డి దూషించడం తగదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.50 లక్షల మంది ఆటో డ్రైవర్ల కటుంబాలు వీధినపడ్డాయని, ఈవీఎంలు కట్టలేని పరిస్థితి ఉందన్నారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. గతంలో రాష్ట్ర రైతాంగానికి ఆదుకొని వారికి అండగా నిలబడి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణను కేసీఆర్ తీసుకొచ్చారన్నారు. కోటి ఎకరాల మాగాణిగా మార్చి కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే విధంగా రైతులకు సాగునీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్ రైతుల శ్రేయస్సు కోసం రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి, కొండపోచమ్మసాగర్ ద్వారా హల్దీవాగులను నింపి వేలాది ఎకరాలకు జీవం పోసి సస్యశ్యామలం చేశారన్నారు. సమావేశంలో నాయకులు గుంటుక రాజు, నాగరాజు పాల్గొన్నారు.





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చెరాగ్‌పల్లి శివారులో హైదరాబాద్-ముంబయి 65వ జాతీయ రహదారిపై రవాణా శాఖ సరిహద్దు చెక్‌పోస్టు

## సిబ్బంది కొరతతో ఆదాయానికి గండి..!

చెరాగ్‌పల్లిలోని రవాణాశాఖ చెక్‌పోస్టులో ఏఎంవీఐల కొరత

- 9 ఏఎంవీఐ పోస్టులు ఖాళీలు
- ఎంవీఐలపై పెరిగిన పనిభారం
- విధుల్లో ముగ్గురు ఎంవీఐలు
- కానిస్టేబుల్, హోంగార్డులతో తనిఖీలు
- జనవరి లక్ష్యం రూ. 5 కోట్లు వసూలు

జహీరాబాద్, ఫిబ్రవరి 3 : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చెరాగ్‌పల్లి శివారులో హైదరాబాద్-ముంబయి 65వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రవాణా శాఖ సరిహద్దు చెక్‌పోస్టులో సిబ్బంది కొరత వేధిస్తున్నది. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ చెక్‌పోస్టులో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న 9 ఏఎంవీఐలను బదిలీ చేసింది. దీంతో చెక్‌పోస్టులో వాహన తనిఖీ చేసేందుకు సరిపడా అధికారులు లేకపోవడంతో ఉన్న ఎంవీఐలు రాత్రీపగలు పనిచేస్తున్నారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఈ చెక్‌పోస్టు ద్వారా రూ. 4 కోట్ల ఆదాయం లక్ష్యం విధించగా, లక్ష్యం చేరుకున్నారు. కాగా,చెరాగ్‌పల్లిలోని రాష్ట్ర సరిహద్దు రవాణాశాఖ చెక్‌పోస్టు ద్వారా ఆదాయం వస్తున్నా, ప్రభుత్వం ఏఎంవీఐలను నియమించకపోవడంతో ఉన్న అధికారులు రాత్రీపగలు పనిచేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెరాగ్‌పలి రవాణాశాఖ చెక్‌పోస్టులో 3 ఎంవీఐలు, 9 మంది ఏఎంవీఐలు ఉండేవారు. పూర్తిస్థాయి సిబ్బంది ఉండడంతో రాత్రీపగలు వంతుల వారీగా విధులు నిర్వహిస్తూ పక్కాగా వాహన తనిఖీలు చేసి ప్రభుత్వానికి ఆదాయం తీసుకువచ్చారు. ప్రస్తుతం సిబ్బంది కొరతతో ఆ పరిస్థితి లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది.



వాహన తనిఖీలు చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్‌గౌడ్

### నిత్యం వందలాది వాహనాల రాకపోకలు...

రాష్ట్ర సరిహద్దులోని చెరాగ్‌పల్లి రవాణా శాఖ చెక్‌పోస్టు మీదుగా నిత్యం 1100 వరకు లారీలు, వందలాది డీసీఎంలు, గూడ్స్ వాహనాలు, 100 వరకు ట్రావెల్స్ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. తెలంగాణ నుంచి కర్ణాటక, మహారాష్ట్ర వైపు వెళ్లే వాహనాలను సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తారు. అనుమతి పత్రాలు లేకపోతే ఫీజు తీసుకుని అనుమతి పత్రాలు జారీచేస్తారు. వాహనాలు తనిఖీ చేసే ఏఎంవీఐలు లేకపోవడంతో ఎంవీఐలు తనిఖీ చేస్తున్నారు. వారికి కానిస్టేబుల్, హోంగార్డులు సహకరిస్తున్నారు. పనిభారం పెరిగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఉన్నతాధికారులకు నివేదించాం..



చెరాగ్‌పల్లి శివారులోని రవాణా శాఖ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తున్నాం. రవాణా శాఖ చెక్‌పోస్టులో 3 ఎంవీఐలు, 9 మంది ఏఎంవీఐలు పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం చెక్‌పోస్టులో 3 ఎంవీఐలు మాత్రమే పనిచేస్తున్నాం. 9 ఏఎంవీఐలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఎంవీఐ పోస్టులు ఖాళీగా ఉండడంతో పనిభారం పెరిగింది. జనవరిలో రాత్రీపగలు విధులు నిర్వర్తించి ప్రభుత్వం లక్ష్యం రూ. 5 కోట్లు వసూలు చేశాం. ఏఎంవీఐలు లేకపోవడంతో కానిస్టేబుల్, హోంగార్డులతో వాహనాలు తనిఖీ చేస్తున్నాం. ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని ఉన్నతాధికారులకు నివేదించాం.

– శ్రీనివాస్‌గౌడ్, చెరాగ్‌పల్లి ఎంవీఐ చెక్‌పోస్ట్ ఇన్‌చార్జి అధికారి



హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్‌లో చిన్నారితో కలిసి బంగారం తూకం వేయించుకుంటున్న మహిళ

## జాతర సందడి

- దగ్గర పడుతున్న సమ్మక్క, సారలమ్మ జాతర
- హుస్నాబాద్ పట్టణంలో బెల్లం తూకం వేయించుకుంటున్న భక్తులు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 3: సమ్మక్క, సారలమ్మ జాతర దగ్గర పడుతుండటంతో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం జనసంద్రంగా మారుతున్నది. బంగారం(బెల్లం) కొనుగోలు చేసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుండటంతో దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ఈనెల 21 నుంచి 24వతేదీ వరకు సమ్మక్క, సారలమ్మ జాతర జరగనున్నది. హుస్నాబాద్ పట్టణంలోని పలు దుకాణాల వద్ద ఎత్తు బంగారం (అమ్మవార్లకు బెల్లం నైవేద్యం) ఇస్తున్నారు. దీంతో ఆయా దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంటున్నది. మహిళలు, పురుషులు, పిల్లలు తమ నిలువెత్తు బంగారాన్ని తూకం వేయించుకుంటున్నారు. రెండేండ్లకు ఒకసారి జరిగే జాతరకు ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## విద్య, వైద్యానికి పెద్దపీట

- అందోల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తాం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- అందోల్-జోగిపేట పాలిటెక్నిక్ కళాశాల తనిఖీ



అందోల్: అందోల్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అందోల్, ఫిబ్రవరి 3 : అందోల్ నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాల్లో ముందుంచడమే లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం అందోల్‌లోని పాలిటెక్నిక్ కళాశాలను మంత్రి తనిఖీ చేశారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి మెడికల్ కాలేజీ, నర్సింగ్ కళాశాలతో పాటు 150 పడకల దవాఖాన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని సమకూర్చాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడిన మంత్రి.. సిబ్బంది, విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కళాశాలలో ప్రహరీ నిర్మాణం, వర్క్‌షాపు షెడ్డుతో పాటు ఇతర అవసరాలున్నట్లు గుర్తించి నిధులు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గ ప్రజల సౌలభ్యం కోసం నూతనంగా 150 పడకల దవాఖాన నిర్మిస్తున్నామని, నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేసి విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో అందోల్ నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, ప్రవీణ్, నాయకులు ప్రదీప్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వినయ్ గౌడ్ పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

రేగోడ్, ఫిబ్రవరి 3 : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైద్య,ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని లింగంపల్లి, పోచారం, మర్పల్లి, రేగోడ్, జగిర్యాల, ఆర్ఇటిక్యాల గ్రామాల్లో రూ. కోటి డెబ్బై ఐదు లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని దళితవాడల్లో పర్యటించి సమస్యలపై ఆరాతీశారు. తాగునీరు, విద్యుత్ స్తంభాలు, మురుగు కాల్వల సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### ఆడపిల్లలకు ఆర్థిక సాయం

మండల కేంద్రంలోని దళితవాడలో నివసిస్తున్న రమేశ్ తన భార్య చనిపోయిందని, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంత్రిని కోరడంతో ఇద్దరు చిన్నారులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు.

### చదువు ఆయుధం

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మోడల్ స్కూల్, కళాశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశాలకు మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఆయుధమని, చదువు వల్ల మనోధైర్యం, ప్రశ్నించే గుణం అలవడుతుందన్నారు. మాతృభాషలో మాట్లాడుతూనే ఇతర భాషలను గౌరవించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.85 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రాధాకిషన్, ఆర్డీవో అంబదాస్, తహసీల్దార్ బాలలక్ష్మి, జడ్పీటీసీ యాదగిరి, రాయికోడ్ పీసీసీ కిషన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబర్ రావు, సీనియర్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

హత్నూర, ఫిబ్రవరి 3: అసైన్డ్ భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ఎల్లమ్మగూడ శివారులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన ''అసైన్డ్ భూమిలో అక్రమ నిర్మాణాలు'' కథనంపై రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు స్పందించారు. శనివారం అక్కడకు వెళ్లి పోలీసుల సహకారంతో ప్రహరీ నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. గతంలో నిర్మించిన ఇండ్లకు నోటీసులు జారీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కాగా అసైన్డ్ భూమిలో నిర్మించిన ఇండ్లకు ఏవిధంగా ఇంటి నంబర్లు కేటాయించారన్న విషయం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అసైన్డ్ భూమి అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని, ఈవిషయంపై పూర్తిస్థాయిలో ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ శషాంక్, గ్రామపంచాయతీ కార్యదర్శి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



అసైన్డ్‌భూమిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

## అక్రమ రవాణాపై కొరడా..

- మట్టి, ఇసుక, ఇటుక తరలిస్తున్న వాహనాలు సీజ్
- రూ.1.24 లక్షలు జరిమానా
- మెదక్ జిల్లా మైనింగ్ శాఖ ఏడీ జయరాజ్

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ) : మట్టి, ఇసుక, ఇటుక అక్రమ రవాణాపై గనులు, భూగర్భ శాఖ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం మెదక్ పట్టణంలో దాడులు నిర్వహించి మట్టి, ఇటుకలు తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకుని రూ.1.24,450 జరిమానా వసూలు చేసినట్లు మైనింగ్ శాఖ ఏడీ జయరాజ్ తెలిపారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు, వాహనాలు సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. గత నెల 29వ తేదీన జిల్లాలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించిన మైనింగ్ అధికారులు రూ.1.52 లక్షల జరిమానాలు విధించారు. అక్రమ రవాణా నియంత్రణకు నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నట్లు ఏడీ జయరాజ్ తెలిపారు.



మెదక్‌లో మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌కు జరిమానా విధిస్తున్న మైనింగ్ ఏడీ జయరాజ్



సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌడుతండాలో సాగు చేసిన మొక్కజొన్న చేను

## మొక్కజొన్న సాగుపై మక్కువ

అక్కన్నపేట, ఫిబ్రవరి 3 : మొక్కజొన్న సాగుపై రైతులు మక్కువ పెంచుకున్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, హుస్నాబాద్, కోహెడ, బెజ్జంకి మండలాల్లో గతేడాదితో పోల్చితే సుమారు రెట్టింపు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. చెరువులు, కుంటల్లో నీళ్లు సరిగ్గా లేకపోవడం, భూగర్భ జలాలు తగ్గడం, పెట్టుబడి కూడా తక్కువ, పంట మార్పిడి విధానం, కరెంట్ స్థితిగతులు, వేసవి రాక ముందే పంట కోతకు వస్తుందనే ఆలోచనతో రైతుల మొక్కజొన్నసాగువైపు దృష్టి సారించారు. గతేడాది హుస్నాబాద్ డివిజన్‌లో సుమారు 7 వేల ఎకరాల మొక్కజొన్న సాగుచేయగా ఈ ఏడాది 13 వేల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ చేపట్టిన పంటల నమోదు ద్వారా తెలిసింది.

### తగ్గిన భూగర్భ జలాలు.. పెరిగిన సాగు

వరితో పోల్చికుంటే మొక్కజొన్నసాగుకు నీరు తక్కువ అవసరం ఉంటుంది. మొక్కజొన్న చేను ప్రారంభ దశలో మినహా తర్వాత వారం రోజులకు ఒకసారి నీళ్లు పడితే సరిపోతాయి. రైతులు పెట్టుబడి తక్కువ అయ్యేలా బీటీ (దుక్కి చేయకుండా) మొక్కజొన్నసాగు చేపట్టారు. ప్రస్తుతం పలు చోట్ల తలపూవ్వు, పీచుతొడుడు, పాల కంకి, కంకులు అయిన స్థాయిలో చేన్లు ఉన్నాయి. మొత్తంగా మార్చి నెలాఖరు లేదా ఏప్రిల్ రెండో వారంతో మొక్కజొన్నకోతకు వచ్చే విధంగా రైతులు సాగు చేశారు.

### మొక్కజొన్న సాగు పెరిగింది



హుస్నాబాద్ డివిజన్‌లో మొక్కజొన్న సాగు పెరిగింది. జీరో టిల్లర్ పద్ధతిలో మొక్కజొన్న సాగు బెటర్. నీళ్లు కూడా తక్కువ, ఎండలు ముదిరేనాటికి చేన్లు అయిపోతాయి. పంట మార్పిడి విధానంలో దిగుబడి బాగా వస్తుంది. మార్కెట్‌లో మక్కలకు మంచి డిమాండ్ ఉంది.

–మహేశ్, ఏడీఏ, వ్యవసాయశాఖ, హుస్నాబాద్ డివిజన్

### రెండు ఎకరాల్లో సాగు



మూడు ఎకరాల భూమి ఉంది. ఎకరం భూమి బీడు ఉంచి రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. గతేడాది నీళ్లు ఎక్కువగా ఉండే. ఈ సారి భూగర్భజలాలు తగ్గాయి. ఇప్పటి నుంచే బోర్లు ఆగిఆగిపోస్తున్నాయి. అందుకే మొక్కజొన్న సాగుచేపట్టా. నెల పదిహేను రోజుల వరకు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

– సమ్మయ్య, రైతు, చౌడుతండా

## పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పాల్గొన్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్, అధికారులు

- వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి
- ఉపాధి హామీ పథకం సమర్థవంతంగా నిర్వహిస్తాం
- పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- మెదక్, సిద్దిపేట కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

మెదక్, (నమస్తే తెలంగాణ) / సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 3 : : పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల ద్వారా అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, ఇంజినీరింగ్ అధికారులతో పంచాయతీల అభివృద్ధిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఇందులో భాగంగా ప్రత్యేక అధికారుల ద్వారా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మెదక్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రమేశ్, డీపీవో సాయిబాబు, జడ్పీ సీఈఓ శైలేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీన సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున 2వ తేదీ నుంచి అన్ని పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్నారని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేసేలా గ్రామీణ నీటి సరఫరా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుని, కూలీలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ, డంపింగ్ యార్డు, వైకుంఠధామాల అభివృద్ధికి సంబంధిత అధికారుల సమన్వయంతో ముందుకెళ్లనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈనెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పంచాయతీల్లో పారిశుద్ధ్యం పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేశ్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఎస్సీ శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.